క్లుప్తంగా

కొవ్వొత్తులతో నిరసన



కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

జమ్మలమడుగు : కలకత్తాలో జూనియర్ డాక్టర్ మృతిపై మంగళవారం రాత్రి పట్టణంలోని గాంధీ విగ్రహం వద్ద డివైఎఫ్ఐ, గండికోట చారిటబుల్ ట్రస్టు, ఆర్ఎంపీ వైద్యుల ఆసోషియేషన్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ డాక్టర్‌ని చంపిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ శాంతి కోసం ర్యాలీ



శాంతి ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

పులివెందుల టౌన్ : మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ శాంతి కోసం శాంతి ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాల వేసి స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ డి.వి.కొండారెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, ఎస్ఐ నారాయణలు ర్యాలీని ప్రారంభించారు. కులమతాలకు అతీతంగా సర్వమానవాళీ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో జీవించాలని మానవత సంస్థ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం శాంతి వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, మానవత స్వచ్ఛంద సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా బతకడం నేర్చుకోవాలి

జమ్మలమడుగు : ప్రతి ఒక్కరు ప్రశాంతంగా బతకడం నేర్చుకోవాలని ఎంఈఓ చంద్రశేఖర్ రావు, డిప్యూటీ తహసీల్దార్ వేణుగోపాల్‌లు తెలిపారు. మంగళవారం మానవతా సేవ సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచశాంతి కోసం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ భవిష్యత్తు, ప్రపంచ భవిష్యత్తు అంతా విద్యార్థుల చేతిలోనే ఉందన్న విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సేవా సంస్థ అధ్యక్షుడు బీటి నరసింహారెడ్డి, సెక్రెటరీ పార్థసారధి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి శుక్రవారం డ్రైడేను తప్పని సరిగా పాటించాలి

కమలాపురం : ప్రతి శుక్రవారం డ్రైడేను తప్పని సరిగా పాటించి పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకోవడం ద్వారా దోమల వలన వచ్చే వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చునని మలేరియా సబ్ యూనిట్ అధికారులు లక్షుమయ్య, ప్రసాద్ తెలిపారు. ప్రపంచ దోమల దినోత్సవాన్ని పురస్కరించుకుని వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అంబేద్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. దోమల నుంచి మనల్ని మనం రక్షించుకోవడంతో పాటుగా దోమల సంతానోత్పత్తి ప్రవశాలను సమూలంగా నిర్మూలించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం వుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తులశమ్మ, స్టాఫ్ నర్సు రెడ్డెమ్మ, హాస్టల్ సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టరు శాంతికల

ఎర్రగుంట్ల : వాధ్యులు ప్రబలకుండా ముందస్తుగా అన్ని జాగ్రత్తలు చేపట్టాలని డిప్యూటీ డీఎంహెచ్ఎం డాక్టర్ శాంతికల తెలిపారు. మంగళవారం పట్టణంలోని పీహెచ్‌సీ, అర్బన్ హెల్త్ సెంటర్లను ఆమె ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులతో పాటు వైద్యసిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం సూచించిన మేరకు మాస్టర్ ప్లాన్ ప్రకారం ప్రతి ఒక్కరు తప్పనిసరిగా విధులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు శ్రీనాథ్‌రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ వేంకటేశ్వర్లు, అధికారులు లక్షుమయ్య, హెల్త్ సూపర్‌వైజర్లు ఓబులేసు, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు ఇతరులు పాల్గొన్నారు

చుట్టుముట్టిన వరదనీరు



కొండాపురం : మండలంలోని చిన్నపల్లెను సోమవారం రాత్రి కురిసిన వర్షంకు వరదనీరు చుట్టుముట్టింది. తిమ్మాపురం గ్రామ సమీపంలో 12 ఏళ్ల కిందట చెరువు నిర్మాణం జరిగింది. చెరువు నిర్మాణం చేపట్టినప్పటినుంచి వర్షం కురిస్తే చిన్నపల్లె గ్రామ పొలంలోనుంచి వచ్చే వరదనీరు తిమ్మాపురం వైపు వెళ్లేవి. కానీ చెరువు నిర్మించడంతో వర్షం కురిస్తే గ్రామాన్ని వరదనీరు చుట్టుముట్టుతోంది.

ఆఖరి మజిలీకి గౌరవంగా..

- వైకుంఠ రథాల ద్వారా సేవలందిస్తున్న మానవత స్వచ్ఛంద సేవా సంస్థ
- అనాథ మృతదేహాలకు ఉచితంగా అంత్యక్రియలు
- అనారోగ్యంతో బాధపడుతున్న వారికి, పేద విద్యార్థులకు ఆర్థిక సాయం
- వేసవి తాపం తగ్గడానికి ప్రత్యేకంగా చలివేంద్రాలు



మానవత స్వచ్ఛంద సేవా సంస్థ వైకుంఠ రథం



అనారోగ్యంతో బాధపడుతున్న వారికి సాయం అందిస్తున్న మానవత



ఎర్రగుంట్ల : నా అనుకునే వారికి ఏదైనా జరిగితే తల్లడిల్లిపోతాం. అలాంటిది మృతి చెందితే ఆ బాధ చెప్పలేనిది. ఇంకా వారి అంతిమసంస్కారాలు నిర్వహించే వైకుంఠధామం ఎక్కడో దూరాన ఉంటే తీసుకెళ్లేందుకు పడరాని పాట్లు పడుతుంటాం. అంత్యక్రియలను వ్యాపారంగా మార్చేసిన ప్రైవేటు వ్యవస్థకు దీటుగా పూర్తి సేవా భావంతో ఎర్రగుంట్ల మానవత స్వచ్ఛంద సేవా సంస్థ పదేళ్ల కిందటే వైకుంఠ రథాలను అందుబాటులోకి తెచ్చింది. పాడెకట్టుకుని నలుగురి అతి ప్రయాసతో తీసుకెళ్లాల్సిన పరిస్థితిని ఆసాంతం మార్చేసి దుఃఖం నుంచి సాంత్వన కల్గించే భగవద్గీత శ్లోకాలు , ధైర్యం చేప్పే వైరాగ్యగీతాలు, భక్తి భావం ఉట్టిపడే ఆకారంతో వైకుంఠ రథాలు అమూల్యమైన సేవలందిస్తున్నాయి. అయితే దురదృష్టవశాత్తు జరగరానిది జరిగినప్పుడు చాలా మంది సాయం కోసం ఎవరిని సంప్రదించాలో తెలియక ఇబ్బందులు పడుతుంటారు. తెలిసిన వారందరినీ అడుగుతూ నిరాశ పడకుండా తెలుసుకునేలా వైకుంఠ రథాలతో కూడిన మానవత చేస్తున్న కథనంపై ప్రత్యేకంగా మీకోసం...

మండలంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థను 2015లో ఏర్పాటు చేశారు. అప్పటిలో కొద్ది మందితోనే ఉండే ఈ సంస్థ దినదినాభివృద్ధి చెందుతూ ప్రస్తుతం మానవులకు అన్ని విధాలుగా సేవాలు అందిస్తోంది. ఈ సేవా సంస్థకు మొదటిగా మడక మునెయ్య వైకుంఠ రథంను అందించారు. తర్వాత ప్రముఖ పారిశ్రామిక వేత్త కల్లూరు గంగాధర్‌రెడ్డి రూ.8 లక్షలు విలువతో కూడిన వైకుంఠ రథంను మానవత స్వచ్ఛంద సేవా సంస్థకు అందించారు. ప్రస్తుతం మండలంలో ఏ మృతదేహానికైనా వైకుంఠ రథం కావాల్సి వస్తే మానవత వారిని సంప్రదిస్తే వెంటనే వైకుంఠ రథం ఇంటి వద్దకే వచ్చే విధంగా ఏర్పాటు చేశారు. అలాగే వైకుంఠ రథంతోనే కాకుండా మృతదేహాలను చల్లటి వాతారవరణంలో భద్రపరిచే విధంగా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఐదు ఫ్రీజర్లను అందుబాటులో ఉంచారు.

పేద అనారోగ్య బాధితులకూ చేదోడుగా..

ఈ సేవా సంస్థ పేదలు అనారోగ్యంతో బాధపడుతున్నా వారికి ఆర్థిక సాయం చేస్తూ చేయూతను అందిస్తోంది. ప్రభుత్వ పాఠశాలలో ప్ర తిభ కనపరిచిన పేద విద్యార్థులకు నగదు పారితోషకాలు, అనారోగ్యంతో బాదపడుతు ఇంటిలో ఉన్న బాధితులకు రూ.10 వేలు నగదు ఆర్థిక సాయం చేస్తున్నారు. మండలంలో పచ్చదనం అభివృద్ధిలో భాగంగా మొక్కలు నాటే కార్యాక్రమాలు చేస్తున్నారు. ఎవరైనా సాయం కోసం రఘురామిరెడ్డి, సంస్థ చైర్మన్ 9849265855, డాక్టర్ రామానుజన్‌రెడ్డి సంస్థ అధ్యక్షుడు 9440895629 నెంబర్లకు కాల్ చేయవచ్చు.

సేవలు అందించడంలో ముందుంటాం



ఎర్రగుంట్ల మండలంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థను 2015లో ఏర్పాటు చేశాం. అప్పటి నుంచి ఇప్పటి వరకు సేవా కార్యక్రమాలు నిరంతరాయం సాగుతున్నాయి. ఐదు ఫ్రీజర్లు, వైకుంఠ రథాలతో సేవలు అందిస్తున్నాం. మరిన్ని సేవలు చేయడానికి ప్రణాళికలు చేసుకుంటున్నాము. ప్రస్తుతం సభ్యులు 460 మంది ఉండుగా 600కు చేసే ఆలోచనలో ఉన్నాం.

– రఘురామిరెడ్డి, చైర్మన్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ, ఎర్రగుంట్ల.

ఈ సేవా సంస్థకు సాయం అందిస్తాను



మానవత స్వచ్ఛంద సేవా సంస్థకు రూ.8 లక్షలు విలువ చేసే వైకుంఠ రథంను అందించాను. దీంతో ఈ సంస్థ చేసే సేవా కార్యక్రమాలలో నేను కూడా భాగస్వామ్యం కావడం ఎంతో సంతోషంగా ఉంది. ప్రస్తుతం అనాథ మృతదేహాలను శ్మశాన వాటిక వద్దకు తీసుకెళ్లు రథం ఎంతోగాను ఉపయోగపడుతుంది.

– కల్లూరు గంగాధర్‌రెడ్డి, దాత, పారిశ్రామిక వేత్త, ఎర్రగుంట్ల

ఘనంగా వీరభద్రుడికి జలాభిషేకం



వీరభద్రస్వామికి జలాభిషేకం చేస్తున్న భక్తుడు

పులివెందుల టౌన్ : పట్టణంలోని తూర్పు ఆంజనేయస్వామి సమీపంలో ఉన్న శ్రీ భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయంలో మంగళవారం ఆలయ చైర్మన్ గూడూరు గురుప్రసాద్ ఆధ్వర్యంలో 108 బిందెల జలాభిషేకం నిర్వహించారు. శ్రావణమాసాన్ని పురస్కరించుకుని లోకకళ్యాణార్థం స్వామి వారికి ఉదయం 6 గంటల నుండి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి తదనంతరం భక్తులచే 108 బిందెల జలాభిషేకం నిర్వహించారు. జలాభిషేకం చేయడం వల్ల వర్షాలు సకాలంలో పడి రైతులు, ప్రజలు సుభిక్షంగా ఉంటారన్నారు. అనంతరం వీరభద్రునికి వెండిముఖ కవచములతో, పూలతో అలంకరించి మహా మంగళహారతులు పట్టారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు, గురుజంగమ వీరశైవలింగాయతి సంఘం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు



మాట్లాడుతున్న డీఎస్పీ మురళీనాయక్

పులివెందుల రూరల్ : బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ మురళీనాయక్ తెలిపారు. మంగళవారం పోలీస్ సిబ్బందితో ఆయన సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు ప్రభుత్వ సంస్థ ఆవరణలో, రహదారులకు ఇరువైపులా పిచ్చి మొక్కలను, చెత్తాచెదారాలను విద్యార్థుల సహకారంతో శుభ్రం చేయడం జరిగిందన్నారు. పులివెందుల డివిజన్ పరిధిలో చాలా మంది మందు బాబులు బహిరంగ ప్రదేశాల్లోనూ, ఫుట్‌పాత్‌లపై, ఖాళీ స్థలాల్లో మద్యం సేవించి మందు సీసాలను, గ్లాసులను పగులగొడుతున్నారన్నారు. అలాంటి వారిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : బహిరంగ ప్రదేశాల్లో ఎవరైన మద్యం సేవిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలమల్ల ఎస్ఐ తిమోతి హెచ్చరించారు. మంగళవారం కలమల్ల పరిధిలోని బహిరంగంగా మద్యం సేవించే ప్రాంతాల్లో పరిశుభ్రత చర్యలను చేపట్టారు. అలాగే మద్యం దుకాణం వద్ద పంచాయతీ కార్మికులతో శుభ్రం చేయించారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తల రక్తదానం



రక్తదాన శిబిరంలో రక్త దాతకు జ్యూస్ అందిస్తున్న సంబటూరు ప్రసాద్‌రెడ్డి

కమలాపురం : కమలాపురం మాజీ ఎమ్మెల్యే పోచిమరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో అనాథ బాలుర ఛాత్రాలయంలో విద్యార్థులతో కేక్ కట్ చేయించి వారికి అల్పాహార విందు ఏర్పాటు చేశారు. హార్టికల్చర్ స్టేట్ ఎక్స్ అడ్వైజర్ సంబటూరు ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 23 మంది వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు,అభిమానులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ ఇస్మాయిల్, పార్టీ నాయకులు ఉత్తమారెడ్డి, రాజుపాలెం సుబ్బారెడ్డి, గంగాధర్‌రెడ్డి, సుమిత్ర రాజశేఖర్‌రెడ్డి, చెన్నకేశవరెడ్డి, సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

చెన్నూరులో..

వల్లూరు (చెన్నూరు) : చెన్నూరులోని పునీత్ లారెన్స్ అనాథాశ్రమంలో ఉప్పరపల్లి ఎంపీటీసీ నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి జన్మదిన సందర్భంగా వృద్ధులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. పార్టీ మండల కన్వీనర్ జీఎన్ భాస్కర్‌రెడ్డి, ఎంపీపీ సురేష్‌యాదవ్, ఎర్రసాని నిరంజన్‌రెడ్డి సొంటాం నారాయణరెడ్డి, సుబ్బారెడ్డి, అల్లి శ్రీరామ్మూర్తి, మోహన్ రెడ్డి, అశ్రత్, నిత్య, అన్వర్ బాషా తదితరులు

సమాజంలో చక్కటి విలువలు నెలకొల్పడమే లక్ష్యం



ర్యాలీలో మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

వేంపల్లె : సమాజంలో చక్కటి విలువలు నెలకొల్పడమే మానవత సంస్థ లక్ష్యమని వ్యవస్థాపకుడు రామచంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం వేంపల్లెలోని ఆయా పాఠశాలల విద్యార్థులు మానవత ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. శ్రీచైతన్య, ఉషాకిరణ్, శ్లోకా పాఠశాలల విద్యార్థులు, కరస్పాండెంట్‌లు చక్రపాణిరెడ్డి, బిఎస్ రమణారెడ్డి, నవనీశ్వర్‌రెడ్డిలు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. వేంపల్లె సీఐ సురేష్‌రెడ్డి శాంతి ర్యాలీని ప్రారంభించారు. కులమతాలకు అతీతంగా సర్వమానవాళీ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో జీవించాలని కోరుతూ మానవత సంస్థ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం శాంతి వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు వ్యవస్థాపకుడు రామచంద్రారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మానవత కేంద్ర నియంత్రణ కమిటీ డైరెక్టర్ రామాంజులరెడ్డి, రీజినల్ డైరెక్టర్ బాలాజీ, అధ్యక్షుడు పోతిరెడ్డి శ్రావణ్, ఉపాధ్యక్షుడు యోగీశ్వర్‌బాబు, కోశాధికారి శ్రీకళ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మంగళగౌరీ వ్రతం



మంగళగౌరీ వ్రతం ఆచరిస్తున్న మహిళలు

వేంపల్లె : స్థానిక బలిజ సంఘం వీధిలో వెలసిన శ్రీ గౌరీదేవి ఆలయంలో మంగళగౌరీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో ఆచరించినట్లు ఆలయ ప్రెసిడెంట్లు నంబూరు కుల్లాయప్ప, కటిక చంద్రశేఖర్‌లు తెలిపారు. ప్రతీ ఏడాది శ్రావణమాసంలో మహిళా మండలి ఆధ్వర్యంలో ఈ వ్రతాన్ని నిర్వహిస్తారన్నారు. ఆలయ అర్చకులు శంకరమంచి ప్రసాద్‌శర్మ నేతృత్వంలో మహిళలందరూ వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో మహిళా మండలి అధ్యక్షురాలు రత్నాలు, మాజీ అధ్యక్షులు కొత్తూరు రెడ్డయ్య, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు వాణిజ్య పన్నుల కార్యాలయం ప్రారంభం

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక మిట్టమిల్లేశ్వరస్వామి శివాలయం ఎదురుగా బుధవారం వాణిజ్య పన్నుల శాఖ నూతన కార్యాలయంను (స్టేట్ జీఎస్టీ ఆఫీసు)ఆ శాఖ ఉన్నతాధికారులు ప్రారంభించనున్నారు. 20 సంవత్సరాల తర్వాత మొట్టమొదటిసారిగా పులివెందులలో ఈ కార్యాలయం ప్రారంభించడం విశేషం. బుధవారం ఉదయం 11 గంటలకు స్టేట్ జీఎస్టీ శాఖ అధికారులు ఈ కార్యాలయాన్ని ప్రారంభించనున్నారు. కార్యక్రమంలో వ్యాపారస్తులు, వివిధ వాణిజ్య సముదాయ ప్రతినిధులు, పలు సంస్థల ప్రతినిధులు పాల్గొని జయప్రదం చేయాలని పులివెందుల ఆడిటర్ల అసోసియేషన్, వాణిజ్య పన్నుల శాఖ అధికారులు ఒక ప్రకటనలో కోరారు.

బయోజైమ్ ప్రగతి స్కాలర్‌షిప్ పంపిణీ



స్కాలర్‌షిప్‌లు పొందిన విద్యార్థులతో జనార్ధన్‌రెడ్డి

వేంపల్లె : పాములూరు గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు బయోజైమ్ ప్రగతి స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేసినట్లు బయోస్టాడ్ ఇండియా లిమిటెడ్ ప్రతినిధి జనార్ధన్‌రెడ్డి వెల్లడించారు. మంగళవారం ఆ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న 10 మంది విద్యార్థులకు రూ.2500ల చొప్పున స్కాలర్షిప్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా దేశవ్యాప్తంగా నాలుగువేల మంది విద్యార్థులకు రూ.కోటి వరకు స్కాలర్షిప్‌లను అందించామన్నారు. చదువులో రాణించేందుకు వ్యవసాయదారుల పిల్లలకు తమ సంస్థ ప్రోత్సాహం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం నాగసుబ్బారెడ్డి, సంస్థ ఎండీ రమేష్, ఎరువుల దుకాణాదారులు సంజీవరెడ్డి, బైరిశెట్టి బాలగంగాధర్, ఉపాధ్యాయులు, రైతులు పాల్గొన్నారు.

శాశ్వత మరమ్మతులకు నోచుకోని వంతెన



శెట్టివారిపల్లెకు వెళ్ళే రహదారిలో కోతకు గురైన వంతెన

ముద్దనూరు : గాలేరు–నగరి ప్రధాన కాలువ మీద నిర్మించిన వంతెన పలుమార్లు కోతకు గురవుతోంది. మండలంలోని శెట్టివారిపల్లె గ్రామానికి వెళ్ళే ప్రధాన రహదారి వద్ద వంతెన కొద్దిపాటి వర్షం కురిసినా కోతకుగురై ఆ గ్రామ వాసులకు రాకపోకలకు ఇబ్బందిగా మారింది. కాలువ నిర్మించిన సమయంలో నాణ్యత లేకుండా వంతెన నిర్మాణం చేపట్టడంతోనే తరచూ కోతకు గురవుతోందని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికే రెండుసార్లు స్థానిక సర్పంచ్ తన స్వంత ఖర్చులతో కోతకు గురైన వంతెనకు మరమ్మతులు చేపట్టారు. సోమవారం రాత్రి కురిసిన వర్షంతో వంతెన దెబ్బతినిందని, సంబంధిత అధికారులు స్పందించి వంతెనకు శాశ్వత మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చిరుద్యోగులపై రాజకీయ వేధింపులు తగదు

జమ్మలమడుగు : ప్రభుత్వాలు మారినప్పుడల్లా చిరుద్యోగులపై రాజకీయ వేధింపులకు గురిచేయడం సరైందికాదని సీపీఐ కార్యదర్శి ప్రసాద్ తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద వారు నిరసన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. గ్రామాలలో అంగన్‌వాడీ వర్కర్లపై వేధింపులు ఎక్కువ అవుతున్నాయన్నారు.

మరమ్మతులకు గురైన 'వామికొండ' గేటు

ముద్దనూరు : గాలేరు–నగరి సుజల స్రవంతిలో అంతర్భాగమైన వామికొండ రిజర్వాయరు గేటు మరమ్మతులకు గురైనట్లు రైతులు తెలిపారు. మండలంలోని కోనాపురం గ్రామ సమీపంలో నిర్మించిన వామికొండ రిజర్వాయరుకు గండికోట జలాశయం నుంచి నీటిని తరలిస్తారు. 1.6 టీఎంసీ నీటి నిల్వ సామర్థ్యం కలిగిన ఈ రిజర్వాయరు గేటు గత కొంతకాలంనుంచి పనిచేయడంలేదని, రిజర్వాయరులోకి నీరు ప్రవేశిస్తే గేటు మరమ్మతుల వల్ల వృథాగా బయటకు ప్రవహిస్తాయని, గతంలో ఇలాగే జరిగిందని స్థానిక రైతులు తెలిపారు. కొద్ది రోజుల్లో వామికొండలోకి నీరు చేరే అవకాశం వుందని ఆ లోపు గేటు మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ



స్కూల్ బ్యాగులతో విద్యార్థులు

వేంపల్లె : స్థానిక జడ్పీ బాలికల హైస్కూల్‌లోని ప్లస్–2 విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందించిన బ్యాగులను మంగళవారం పంపిణీ చేసినట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ చెరుకూరి శ్రీనివాసులు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఈ ఏడాది పాఠ్య, నోటు పుస్తకాలతో పాటు బ్యాగులను పంపిణీ చేసిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్ విద్యను బలోపేతం చేసేందుకు మరిన్ని వసతులు కల్పించాలన్నారు. ల్యాబ్ సౌకర్యం, మౌలిక సదుపాయాలు, మధ్యాహ్న భోజనాన్ని కలిపించాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్ఐ తులసి నాగప్రసాద్

సింహాద్రిపురం : సైబర్ నేరాలపై ప్రజలు, విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ తులసి నాగప్రసాద్ తెలిపారు. మంగళవారం మండలంలోని రాజారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు ఆయన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. లోన్‌యాప్, సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. లాటరీలు, లక్కీడ్రాలు అంటూ నిత్యం మోసాలు జరుగుతున్నాయని, మభ్యపెట్టే మాటలకు అత్యాశకు పోయి మోసపోవద్దన్నారు. ఓటిపి నేరాలు అధికంగా జరుగుతున్నాయని, మీకు ఫోన్ చేసి ఫలానా బ్యాంకు నుండి మాట్లాడుతున్నామని చెబుతూ ఓటిపి చెప్పాలని అడిగితే ఎట్టిపరిస్థితుల్లో చెప్పకూడదని, ఏ బ్యాంకు కూడా ఓటీపీ చెప్పమని అడగదన్నారు. అంబులెన్స్ 108, వైద్యసాయానికి 104, పోలీస్ హెల్ప్‌లైన్ 100, అత్యవసర సేవలకు 112, అగ్నిమాపకశాఖ హెల్ప్‌లైన్ 101, మహిళల హెల్ప్‌లైన్ 181 హెల్ప్‌లైన్ నెంబర్లపై అవగాహన కల్పించారు. ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్‌కు సంబంధించి డయల్ 100, 1098 లేదా 181కు సమాచారమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. గృహహింసకు సంబంధించి సేవలందిస్తున్న వన్‌స్టాప్ సెంటర్‌ను గురించి వివరించారు. గృహహింసకు గురయ్యే బాధితులు 1098కు ఫోన్ చేసి సాయం పొందవచ్చని, ఉచిత న్యాయ సహాయానికి 15,100 హెల్ప్‌లైన్ నెంబర్‌కు కాల్ చేయవచ్చన్నారు. బాలకార్మికులను, వీధిబాలలను, బడి మానేసిన పిల్లలను గుర్తించి 1098 సమాచారం ఇవ్వాలని సూచించారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్‌లు అందించే సేవలను వివరించారు. బాల్య వివాహాలకు సంబంధించిన సమాచారాన్ని చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 ద్వారా తెలియజేయాలన్నారు. పరీక్షల భయంతో ఒత్తిడికి గురయ్యే విద్యార్థులకు మానసిక నిపుణులు కౌన్సిలింగ్ ద్వారా ఒత్తిడి నుండి ఉపశమనం కల్పిస్తారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దోమకాటు వల్ల వచ్చే వ్యాధులపై అవగాహన



దోమల దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

పులివెందుల రూరల్ : దోమకాటు వల్ల వచ్చే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య తెలిపారు. ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా అర్బన్ పరిధిలోని భాకరాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శాంతికుమార్ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1897లో బ్రిటీష్ వైద్యులు సర్ రొనాల్డ్ రాస్ దోమ వల్ల మలేరియా వ్యాపిస్తుందని కనుగొన్నారన్నారు. ప్లాస్మోడియం పరాన్నజీవుల దోమల రక్తం ద్వారా వ్యాపిస్తాయన్నారు. కాలేయానికి చేరి తర్వాత ఎర్రరక్త కణాలకు వేగంగా సోకుతుందన్నారు. దీనిపై పరిశోధన చేసినందుకు 1902లో రొనాల్డ్ రాస్‌కు ఫిజియాలజీ నోబెల్ బహుమతి లభించిందన్నారు. వీటి ద్వారా ప్రజలు అనారోగ్య భారిన పడకుండా ఉండేందుకు ఆరోగ్య కార్యకర్తలు, ఆశాకార్యకర్తలు ప్రతి గ్రామంలో ప్రజలకు అనాఫిలిస్ ఆడ దోమ కాటు వల్ల మలేరియా వ్యాపిస్తుందని, దోమకాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కలిపించడం జరిగిందన్నారు. అనంతరం ప్రపంచ దోమల దినోత్సవ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ సంపత్, డీఈఓ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి గ్రామ ప్రజలే సమష్టిగా కృషి చేయాలి



గ్రామ సభలో మాట్లాడతున్న కలెక్టర్ శివశంకర్

పెండ్లిమర్రి : గ్రామాభివృద్ధి, అవసరాల కొసం అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో గ్రామ ప్రజలే సమష్టిగా ముందుకు సాగాలని కలెక్టర్ శివ శంకర్ గ్రామస్థులకు పిలుపునిచ్చారు. మండలంలోని పగడాలపల్లె ప్రాథమిక పాఠశాలలో మంగళవారం 2024–25ఆర్థిక సంవత్సరంలో ఉపాధి పనుల గుర్తింపు–ప్రణాళికా ప్రక్రియలపై గ్రామసభ నిర్వహించి మాట్లాడారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా గ్రామంలో మౌలిక సదుపాయాలను కల్పించుకునే ఉద్దేశ్యంతోనే గ్రామంలో ప్రతి కుటుంబానికి వంద రోజులు పని కల్పిస్తున్నామన్నారు. చెర్లోపల్లె గ్రామ పంచాయితీకి దాదాపు రూ.2 కోట్లతో పలు మౌలిక అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారన్నారు. చెర్లోపల్లె గ్రామ పంచాయతీ అభివృద్ధి కొసం తన వంతుగా కలెక్టర్ నిధుల నుంచి రూ.5లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. డీపీఓ ప్రభాకర్‌రెడ్డి, డ్వామా పీడీ జోయల్ విజయ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఏడుకొండలు, సర్పంచ్ గంగిరెడ్డి, ఏపీడీ సోమశేఖర్‌రెడ్డి, ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి, తహసీల్దార్ అనురాధ, ఏపీఓ వెంకటేశ్వరమ్మ, గ్రామ సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

పెరగని కాంట్రాక్టు కార్మికుల వేతనాలు



కార్మిక మంత్రి శుభాష్‌కు వినతిపత్రం అందిస్తున్న ఆర్టీపీపీ యూనియన్ నాయకుడు సుబ్బిరెడ్డి

ఎర్రగుంట్ల : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ 2012లో కాంట్రాక్టు కార్మికుల వేతనాలను పెంపుదల చేస్తూ జీవో 11ను విడుదల చేశారు. ప్రతి ఐదేళ్లకు కనీసం వేతనాలను పెంపుదల చేయాల్సి ఉండగా 13 ఏళ్లగా కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచకపోవడం అన్యాయమని ఆర్టీపీపీకి చెందిన ఏపీ పవర్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నపూస సుబ్బిరెడ్డి తెలిపారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో కార్మిక మంత్రి వాసంశెట్టి శుభాష్‌ను వారు కలసి వినతిపత్రం అందించారు.

ట్రాఫిక్ నియమాలు పాటించాలి

పులివెందుల రూరల్ : పట్టణ పరిధిలోని ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ సీఐ హాజీవలి తెలిపారు. మంగళవారం సీఎస్ఐ చర్చి మైదానంలో ఆయన ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. డ్రైవర్లు ఆటోలు నడిపేటప్పుడు యూనిఫాం ధరించాలన్నారు. అలాగే లైసెన్స్, ఇన్సూరెన్స్, ఆర్సీలను వాహనాల్లో ఉంచాలన్నారు. సుమారు 600 ఆటోలకు గానూ 340 ఆటోలకు పీఎస్ నెంబర్లు మంజూరు చేశామని, మిగిలిన ప్రతి ఒక్కరు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి పీఎస్ నెంబర్లు మంజూరు చేయించుకోవాలన్నారు.